నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 19 జనవరి 2025 | HYDERABAD

ఉపాధ్యాయులకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హామీఇచ్చారు. తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ యూనియన్(టీపీటీయూ) డైరీని శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుగోపాలస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు మట్టపల్లి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి పీ చంద్రశేఖర్, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత గాలికి: శ్రీనగర్‌కాలనీ ప్రధాన రహదారిపై పేరుకపోయిన చెత్త

ట్రాఫిక్ చిక్కుముడులు వీడేదెన్నడో!: శనివారం జూబ్లి బస్టేషన్ ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

సిగ్నల్ వద్ద ఇంజిన్ ఆపుదాం

కాలుష్యాన్ని కట్టడి చేద్దాం

గ్రేటర్‌లో 80లక్షలకు పైగా వాహనాలు

పొగను పీల్చడంతో వాహనదారుల ఆరోగ్యంపై ప్రభావం

రెడ్ సిగ్నల్ ఉంటే ఇంజిన్ ఆపాలంటున్న నిపుణులు

మాసోత్సవంలో భాగంగా అవగాహన కల్పిస్తున్న ఆర్టీఏ అధికారులు

సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : వాహనం అవసరంగా మారిపోయింది. ఒకే ఇంట్లో నాలుగైదు వాహనాలు ఉంటున్నాయంటే అతిశయోక్తి కాదు. హైదరాబాద్ లాంటి నగరంలో ఇక వాహనాల వినియోగం చెప్పక్కర్లేదు. బైకులు, కార్లు నాలుగైదుకు మించి ఉంటున్నాయి. గ్రేటర్‌లో వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటమే ఇందుకు నిదర్శనం. ఇప్పటి వరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సుమారు 85 లక్షలకు మించి వాహనాలు ఉన్నాయి. వాహనాలన్నీ రోడ్డెక్కితే ట్రాఫిక్ సమస్య. ఆ వాహనాల నుంచి విడుదలయ్యే కాలుష్యంతో వాతావరణ సమస్య. ఇవే వాహనాలు ట్రాఫిక్ కూడళ్లలో సిగ్నల్ వద్ద నిలుస్తే ఇంకా పెద్ద సమస్య అని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాహనాల వినియోగం తగ్గించడం మన చేతుల్లో లేకున్నా.. కాలుష్య తీవ్రత తగ్గించడంలో క్రమశిక్షణ పాటించాలని పర్యావరణ వేత్తలు, ఆర్టీఏ అధికారులు సూచిస్తున్నారు. గ్రేటర్‌లోని ట్రాఫిక్ జంక్షన్ల వద్ద సిగ్నల్ పడితే వాహనాల ఇంజిన్ ఆపాల్సిన అవసరాన్ని వివరిస్తున్నారు. 20 సెకన్లకు మించి సిగ్నల్ ఉంటే ఇంజిన్ ఆపకపోతే విష వాయువులను ఉత్పత్తి చేసిన వారిమే కాకుండా ఆ కాలుష్యాన్ని పీల్చి అనారోగ్యబారిన పడే ప్రమాదం పొంచి ఉందని అవగాహన కల్పిస్తున్నారు.

వాహనాల వారీగా కాలుష్యం విడుదల

వాహనం	కాలుష్యం శాతాల్లో
ద్విచక్రవాహనాలు	56.02
ఆటోలు	34.00
పెట్రోల్ కార్లు	12.00
డీజిల్ కార్లు	2.00
ట్రక్కులు	18.85
బస్సులు	1.54
ఇతర వాహనాలు	0.26

ఇంజిన్ ఆపకపోతే..

నగరంలోని సాధారణ ప్రాంతాలతో పోల్చితే ఒక్కో సిగ్నల్ వద్ద 25 శాతానికి పైగా అధిక కాలుష్యం వెలువడుతుందని పర్యావేరణవేత్తలు చెబుతున్నారు. ఇలా నగరంలో ప్రతి రోజూ 1500 టన్నుల పొగ పోగవుతున్నట్టు గతంలో సర్వేలు సైతం వెల్లడించాయి. అనవసరంగా ఇంజిన్ ఆన్‌లోనే ఉంచడంతో కార్బన్ డయాక్సైడ్, నీటి ఆవిరి, హైడ్రో కార్బన్, నైట్రోజన్ ఆక్సైడ్, సీసం, కార్బన్ పొడులు గాలిలో కలుస్తున్నాయి. వీటిని పీల్చుకోవడంతో శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ బారి నపడాల్సిందేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్‌లో సుమారు మూడు వేలకుపైగా ట్రాఫిక్ జంక్షన్లు ఉన్నాయి. ఇందులో సుమారు 1400 జంక్షన్లలో 30 సెకండ్లకు మించి సిగ్నల్స్ పడుతున్నాయి. కొన్ని సార్లు 2 నిమిషాలు, 30-180 సెకండ్లు కూడా పడుతున్నాయి. ఒక్కో సిగ్నల్ వద్ద గరిష్ఠంగా 150 వరకు వాహనాలు నిలుస్తున్నాయి. ఒక వాహనం 40 పీపీఎం కార్బన్ డయాక్సైడ్ చొప్పున కాలుష్యాన్ని విడుదల చేస్తున్నాయి. ఇలా ఒక్కో సిగ్నల్ వద్ద ఆగేవారు 8వేల పీపీఎం కార్బన్ డయాక్సైడ్‌తో పాటు ఇతర కాలుష్యాన్ని పీల్చుకుంటున్నారని నిపుణులు చెబుతున్నారు.

రవాణా శాఖ అధికారుల అవగాహన..

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీఏ అధికారులు వాహనదారులకు అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలతో పాటు వాహన కాలుష్యంపైనా అవేర్నెస్ కల్పిస్తున్నారు. ప్రత్యక్షంగా శరీరానికి గాయాలవడమే ప్రమాదం కాదనీ.. పరోక్షంగా వాహనాల నుంచి విడుదలయ్యే కాలుష్యం మరింత ప్రమాదకరమని చెబుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద బండి ఇంజిన్ ఆపడం వంటి క్రమశిక్షణ పాటించాలని సూచిస్తున్నారు. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ప్రతీ వాహనం పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని వివరిస్తున్నారు. ప్రతీ వాహనం రిజిస్ట్రేషన్ తేదీ నుంచి ఒక ఏడాది వ్యవధి ముగిసిన తర్వాత చెల్లుబాటు అయ్యే పీయూసీ కలిగి ఉండాలి. పీయూసీ పరీక్ష తర్వాత సర్టిఫికెట్ జారీ అవుతుంది. కాలం చెల్లిన వాహనాలు నడిపితే కఠిన చర్యల ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వాహనం కండిషన్‌లో ఉంటే ఎన్నేండ్లైనా రెన్యువల్

15 ఏండ్లు దాటితే ఐదేండ్లకోసారి క్రమబద్ధీకరించుకోవచ్చు

నాన్‌ట్రాన్స్‌పోర్టు వాహనాలకే ఈ సౌలభ్యం

ట్రాన్స్‌పోర్టు వాహనాలకు మాత్రం స్క్రాప్ నిబంధన వర్తింపు

సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : తమ వాహనాలు 15 ఏండ్లు దాటాయి కాబట్టి ఇక తుక్కుకు పంపాలేమోనన్న దిగులు ఇక వద్దు. నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు అలాంటి పరిమితి ఏమీ లేదు. సాధారణంగా ఏ వాహనమైనా రోడ్లపై పయనించేందుకు 15 ఏండ్లు గడువు ఉంటుంది. ఆ గడువు మీరితే తుక్కుకు పంపే అవకాశం ఉంటుంది. అయితే అదే వాహనాన్ని వినియోగించుకోవాలనుకుంటే రెన్యువల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 5 ఏండ్ల వరకు ఆ వాహనానికి అనుమతి లభిస్తుంది. ఇలా అనుమతి లభించిన వాహనం 5 ఏండ్లు దాటినా మరోమారు రెన్యువల్ చేసుకునే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రత్యేక మైన కాల పరిమితి అంటూ ఏమీ లేదని ఆర్టీఏ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు వాహన గడువుకు సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేవని పేర్కొన్నారు. 15 ఏండ్లు దాటితే తుక్కుకు పంపాలనే నిబంధనలు జీహెచ్ఎంసీ పరిధిలో తిరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు మాత్రమే వర్తిస్తాయని వెల్లడించారు. చాలా మంది నాన్‌ట్రాన్స్‌పోర్టు వాహనదారులు తమ వాహన గడువు ముగిసిందని బ్రోకర్లను ఆశ్రయించి డబ్బులు నష్టపోతున్నారని, వాహన సామర్థ్యం మేరకు ఎన్నేండ్లైనా వాహనాన్ని రెన్యూవల్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

రెన్యువల్‌ను అధికారులు ధృవీకరించాలి

నాన్‌ట్రాన్స్‌పోర్టు వాహన సామర్థ్యాన్ని బట్టి దఫదఫాలుగా 5 ఏండ్లు రెన్యువల్ అవకాశం ఉంది. అయితే సంబంధిత వాహనాన్ని ఆర్టీఏ అధికారులు ధృవీకరించాలి. ఈ క్రమంలో ద్విచక్ర, ఫోర్ వీలర్ వాహనాలకు గ్రీన్ ట్యాక్సీ చెల్లించాల్సి ఉంటుంది. 15 ఏండ్లు నిండిన ద్విచక్ర వాహనానికి సాధారణ ఫీజు 1435తో పాటు 2వేలు గ్రీన్ ట్యాక్సీ చెల్లించాలి. గడువు ముగిసిన రోజులకు అంటే నెలకు రూ.300 చెల్లించాలి. ఈ మొత్తం ఫీజు మీసేవలో సంబంధిత ఆర్‌సీతో చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆధార్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఆర్‌సీ తదితర పత్రాలతో ఆర్టీఓ కార్యాలయంలో దాఖలు చేయాలి. అనంతరం ఆ వాహనం మరో ఐదేండ్లు వినియోగించడానికి అనుమతి లభిస్తుంది. ఇదే లెక్కన 15 ఏండ్లు నిండిన ఫోర్ వీలర్ అయితే సాధారణ ఫీజు రూ.5,835తో పాటు గ్రీన్ ట్యాక్సీ రూ.5000లు ఉంటుంది. గడువు ముగిసిన పెనాల్టీ అంటే నెలకు రూ.500లు ఉంటుంది. ఈ మొత్తం ఫీజును మీ సేవలో చెల్లించి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఫోర్ వీలర్ 20 ఏండ్లు వినియోగించి ఉంటే గ్రీన్ ట్యాక్సీ రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. దీంతో మరో ఐదేండ్ల వరకు వాహనం వినియోగించే వీలు ఉంటుందని వివరించారు. గ్రేటర్‌లో 15 ఏండ్లు గడువు ముగిసిన వాహనాలను వెంటనే రెన్యువల్ చేయించుకోవాలంటూ అధికారులు సూచించారు.

గ్రేటర్‌లో కాలం చెల్లిన వాహనాలు ఇలా!

ద్విచక్రవాహనాలు	17 లక్షలు
కార్లు	3.5 లక్షలు
గూడ్స్ క్యారిజెస్	1లక్ష
ఆటోలు	20వేలు
ఇతర వాహనాలు	9వేలు

రైతులు బిల్లులు కట్టలేదని.. పొలాలకు కరెంట్ కట్

దమ్మాయిగూడలోని భోగారంలో సర్కారు నిర్వాకం

కీసర, జనవరి 18; తమది ప్రజాపాలన అని గొప్పగా చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి సర్కారు..ఆరుగాలం శ్రమించే రైతన్నలపైనే కక్ష గట్టింది. నెలా నెలా చెల్లించే 30 రూపాయల సర్వీస్ చార్జి కట్టలేదని చెప్పాపెట్టకుండా రైతుల పొలాలకు కరెంట్ కట్ చేసింది. గ్రామస్తులందరూ ఆ డబ్బులు ఇచ్చేవరకు కరెంటు సరఫరా చేయబోమని తేల్చి చెప్పింది. ఇదంతా ఎక్కడో కాదు.. నగరశివారులోని గ్రామంలో జరిగింది. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని భోగారం గ్రామంలో రైతుల వద్ద నుంచి సర్వీస్ చార్జి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఇందుకు సంబంధించి రైతులతో సంప్రదించి వసూలు చేసుకోవాల్సిన అధికారులు ఏకపక్షంగా ఎలాంటి నోటీసులు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి భోగారం గ్రామస్తుల పొలాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నీళ్లందక అటు పొలాలు ఎండిపోవడంతో పాటు మూగజీవులు కూడా దూప గొని అలమటిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ వ్యవహారంపై ఏఈ మురళీకృష్ణ వివరణ ఇస్తూ భోగారం రైతుల నుంచి కోటిన్నర రూపాయల వరకు బిల్లులు రావాల్సి ఉందని అప్పటివరకు వారికి కరెంటు సరఫరా చేయబోమని తేల్చి చెప్పారు. కాగా నిరుపేద రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని భోగారం గ్రామ మాజీ సర్పంచ్ రాగి రాఘవేంద్రారెడ్డి హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ వచ్చినప్పటినుంచే రైతుల జీవితాలు దుర్భరంగా మారిపోయాయని, రైతులకు ఇవ్వాల్సిన రుణామాఫీ, రైతు భరోసాతో రైతులకు సరిపడే విత్తనాలు, రైతులు పండించిన ధాన్యాన్ని కొనలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 10 సంవత్సరాలుగా రైతులను తన కడుపులో పెట్టుకొని దాచుకున్నాడని రైతులను రారాజులుగా చూశాడని గుర్తు చేశారు. రైతులను ఇలాగే ఇబ్బందులకు గురిచేస్తే పెద్ద ఎత్తున్న రైతులతో కీసరలోని కరెంట్ ఆఫీసును ముట్టడిస్తామన్నారు.

గ్యారంటీలు అమలు కాకపోతే

ప్రజలతో కలిసి ఉద్యమిస్తాం

రేషన్‌కార్డుల జారీకి ఆదాయ అర్హతను 3 లక్షలకు పెంచాలి

ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, వివేకానంద్

మేడ్చల్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ఎలాంటి రాజకీయ ఒత్తిడులకు లోను కాకుండా నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, రేషన్ కార్డులు జారీ చేయాలని లేదంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ హెచ్చరించారు. అధికారంలోకి వచ్చేందుకు అలవికాని హామీలన్నీ ఇచ్చి అవి నెరవేర్చలేక బూటకపు గణాంకాలతో గ్యారంటీలు నెరవేర్చినట్టు చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలందరినీ మోసగిస్తున్నదని వారు ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ పథకాలు అందించేందుకు చేస్తున్న సర్వేలు సరిగా జరగలేదని ఆరోపించారు. శనివారం వారిద్దరూ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం హామీల అమలు తీరును ప్రశ్నించారు.

ఆదాయ అర్హతను పెంచాలి

జీహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి 10 లక్షల మంది దరఖాస్తులు చేసుకుంటే 5.56 లక్షల దరఖాస్తులనే పరిశీలించారు. స్థలం ఉన్న వారికి ఇండ్ల మంజూరు చేస్తునే ఆస్తి పన్ను కడుతున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలి. ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేలో జియో ట్యాంగిగ్ చేయలేదు. వివిధ రకాల సాకులు చూపి అర్హులైన దరఖాస్తుదారులను అనర్హులుగా చూపేందుకు సర్కారు ప్రయత్నిస్తున్నది. కాంగ్రెస్ నాయకులు సూచించినవారినే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని తెలుస్తున్నది. జీహెచ్ఎంసీ పరిధిలో ఇండ్ల కోసం 10 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే..కేవలం 10 వేల మందికే మాత్రమే ఇచ్చేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది. రేషన్‌కార్డుల జారీకి ఆదాయ అర్హతను 3 లక్షలకు పెంచాలి.



-మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే

గ్యారంటీల్లో అవకతవకలు సహించం

అర్హులకు పథకాలు అందకుంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తాం. గ్యారెంటీల అమలులో అధికారులు రాజకీయ ఒత్తిడులకు అధికారులు గురికావొద్దు. అర్హుల ఎంపిక ప్రక్రియలో అవకతవకలు జరిగితే సహించేంది లేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి 1.43 లక్షల దరఖాస్తులను, రేషన్‌కార్డులకు 1.22 లక్షల దరఖాస్తులను స్వీకరించారు. ఈ నెల 26 తర్వాత అర్హులందరికీ 4 గ్యారెంటీలను అందించాలి. లేదంటే ఉద్యమిస్తాం.



-కేపీ. వివేకానంద్ , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే

అమ్ముకోవడమే.. కాంగ్రెస్ పని

- హస్తం పాలనలో హౌసింగ్ బోర్డు ఆస్తులకు గండం
- వేలాన్ని విరమించకుంటే అడ్డుకుంటాం..
- మేము కాపాడితే మీరు అమ్ముతారా?
- ఈ నెల 24న జరిగే వేలం పాటను అడ్డుకుంటాం
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 18 : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వచ్చిన ప్రతిసారీ హౌసింగ్ బోర్డు ఆస్తులకు గండం వస్తున్నదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు. గతంలో వందల ఎకరాలను అమ్మిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఇప్పుడు హౌసింగ్ బోర్డు భూములకు ఎసరు పెట్టిందని చెప్పారు. కేపీహెచ్‌బీ కాలనీలో ప్రజల సొత్తును అమ్ముకుంటే ఊరుకునేది లేదని, హౌసింగ్ బోర్డు స్థలాల వేలాన్ని విరమించుకోకుంటే... ప్రజలతో కలిసి అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో వేలానికి పెట్టిన హౌసింగ్‌బోర్డు స్థలాన్ని స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ కాలంలో ఏర్పడిన హౌసింగ్‌బోర్డు కాలనీలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత స్థలాలను అమ్ముకోవడం అలవాటుగా మారిందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో వందలాది ఎకరాలు అమ్మారని, నేడు కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని పలు ఫేజ్‌లలో 73 ఆస్తులను అమ్మడానికి నోటిఫికేషన్ విడుదల చేశారని, అంతేకాకుండా కాలనీలో ప్రజల అవసరాల కోసం వదిలిన 10 శాతం ఓపెన్ ల్యాండ్‌ను(ప్రజల సొత్తును) సైతం అమ్మకానికి పెట్టడం బాధాకరమన్నారు. కేవలం 6 గజాలే ఉన్న అతి చిన్న స్థలానికి కూడా గజానికి 1.25 లక్షల చొప్పున ధర నిర్ణయించి వేలానికి పెట్టడం మరీ అన్యాయమని విమర్శించారు.

మేము కాపాడితే.. మీరు అమ్ముతారా..?

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో గజం స్థలం కూడా అమ్మలేదని, ఆయా ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కోర్టుల్లో కొట్లాడి కాపాడుకున్నామని కృష్ణారావు చెప్పారు. తాము కాపాడిన స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకానికి పెట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేపీహెచ్‌బీ కాలనీ 1,2వ ఫేజ్‌లో మూడెకరాల స్థలాన్ని కోర్టు ద్వారా దక్కించుకుని పార్కుగా అభివృద్ధి చేశామని, 3వ ఫేజ్‌లో 3 ఎకరాల స్థలంలో మహిళలు, చిన్నారులకు ప్రత్యేక పార్కుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అదేవిధంగా పోచమ్మదేవాలయం కోసం 500 గజాల స్థలం, భగత్‌సింగ్ కాలనీలో దేవాలయం కోసం స్థలాన్ని కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. కాలనీ 9వ ఫేజ్‌లో 2.34 ఎకరాల స్థలాన్ని పార్కుకోసం కేటాయించి హెచ్ఎండీఏతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నెక్సెస్ మాల్ ప్రక్కన 24 ఎకరాల స్థలాన్ని సుప్రీంకోర్టులో కొట్లాడి హౌసింగ్‌బోర్డుకు చెందేలా కృషి చేసినట్లు తెలిపారు. కాగా... కాంగ్రెస్ ప్రభుత్వం గతంలోనే వందల ఎకరాల స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని ఆరోపించారు. ఈ నెల 24న జరిగే వేలం పాటను అడ్డుకుంటామని హెచ్చరించారు.

కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో హౌసింగ్ బోర్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

ఈ నెల 24న వేలంపాటను అడ్డుకుంటాం..

కేపీహెచ్‌బీ కాలనీలో ప్రజల సొత్తును ప్రైవేట్ వ్యక్తులు కొనుగోలు చేయడం మానుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎవరైన కొనుగోలు చేస్తే... ఆ స్థలాలలో నిర్మాణాలు చేయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కేపీహెచ్‌బీ కాలనీలో గజాలలో ఉన్న స్థలాలను విక్రయానికి పెట్టడం దేనికని, ప్రభుత్వ ఏమైనా అడుక్కుతింటుందా? అని ప్రశ్నించారు. కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో ప్రభుత్వ పాఠశాల స్థలం, చర్చి స్థలాలు, ప్రజలు కోసం వదిలిన స్థలాలలో బోర్డులు పెట్టి అమ్మకానికి పెట్టారని తెలిపారు. సాయినగర్ కాలనీలో బీఆర్ఎస్ హయాంలో గజానికి రూ.27వేలు చెల్లించాలని కోరితే.. నేడు రూ.1.25లక్షల ధర నిర్ణయించడం, అల్పదాయ వర్గాల ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసేలా పనిచేయడం సమంజసం కాదన్నారు. ప్రజల అస్తులను అమ్ముకునే వేలంపాటను ప్రభుత్వం, అధికారులు ఆపాలన్నారు. లేనిపక్షంలో ప్రజల ఆస్తులను కాపాడేందుకు ఈనెల 24న జరిగే వేలాన్ని అడ్డుకుంటానని హెచ్చరించారు.